క్లుప్తంగా

డెల్టా కాల్వలకు నీటి విడుదల పెంపు

నిడదవోలు: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతుల సాగు అవసరాల కోసం ఉభయ గోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాలకు అధికారులు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా ధవళేశ్వరం నీటి పారుదల శాఖ హెడ్‌వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను శుక్రవారం పెంచారు. పశ్చిమ డెల్టాకు 7,000, మధ్య డెల్టాకు 1,400, తూర్పు డెల్టాకు 4700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 1,060, తణుకు కాలువకు 880, అత్తిలి కాలువకు 412, నరసాపురం కాలువకు 1888 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

వ్యాన్ ఢీ కొని యువకుడికి గాయాలు

తాళ్లపూడి: మినీ వ్యాన్ ఢీ కొట్టడంతో మోటార్ సైకిల్‌పై ఎదురుగా వస్తున్న తాళ్లపూడికి చెందిన ముళ్ల వినోద్‌కుమార్ అనే యువకుడు గాయపడ్డాడు. తాళ్లపూడి బస్టాండ్ వద్ద శుక్రవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పగిలిన వ్యాన్ అద్దాలు వినోద్‌కుమార్ తలకు, మోకాలికి గుచ్చుకోవడంతో అతడికి గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. తాళ్లపూడి పోలీసులు మోటార్ బైక్‌ను స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరిస్తున్నారు.

అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలి

ఉండ్రాజవరం: వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన నియోజకవర్గంలోని ప్రభుత్వ భవనాల నిర్మాణాలను సెప్టెంబర్ 15 లోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వరప్రసాద్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఏజెన్సీల ప్రతినిధులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల వంటి భవనాలపై క్షేత్రస్థాయిలో ప్రగతి నివేదికను ఆయన సమీక్షించారు. మండలాలవారీగా ఉండ్రాజవరంలో 32, పెరవలిలో 36, నిడదవోలులో 30 భవనాల నిర్మాణాలను పూర్తిచేయాల్సి ఉందన్నారు. డీఈఈ దుర్గాప్రసాద్, మండల పీఆర్ ఏఈ భగవన్నారాయణ, పెరవలి ఏఈ రామచంద్రారెడ్డి, నిడదవోలు ఏఈ శాస్త్రి పాల్గొన్నారు.

7న రెండు మండలాల్లో చంద్రబాబు రోడ్ షో

దేవరపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడి రోడ్ షో ఈ నెల 7న దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో జరుగుతుందని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం పోలవరం నియోజకవర్గంలో రోడ్ షో అనంతరం తాళ్లపూడి, ప్రక్కిలంక, అన్నదేవరపేట మీదుగా గోపాలపురం మండలం చిట్యాల, వేళ్లచింతలగూడెం, గోపాలపురం మీదుగా చంద్రబాబు రోడ్ షో దేవరపల్లి వద్ద గల డైమండ్ జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి దేవరపల్లి మూడు రోడ్ల కూడలికి చేరుకుని సాయంత్రం 4.30 గంటలకు ఏర్పాటు చేసే బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం టీడీపీ అధినేత జాతీయ రహదారి మీదుగా రాజమహేంద్రవరం చేరుకుంటారన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

నిడదవోలు: వాసవీ వనితాక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్సాహంగా స్నేహితుల సంబరాలు నిర్వహించారు. స్థానిక మదనగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మహిళలకు సారీ హౌసీ, పిల్లో హౌసీ, బెడ్ షీట్ హౌసీ, డస్ట్ బిన్స్ హౌసీ పోటీలు నిర్వహించారు. వారిలో విజేతలకు బహుమతులు అందజేశారు. పేద ఆర్యవైశ్యులకు పింఛను కింద నగదు పంపిణీ చేశారు. వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు దివ్వెల ఫణి మాధురి, మాజీ కౌన్సిలర్ కేదారిశెట్టి సునీత, పెరుమాళ్ల విజయ్, జయవరపు లక్ష్మి, గొల్లపూడి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు సూరయ్యపేటలో గడప గడపకూ..

కొవ్వూరు: తాళ్లపూడి మండలం, అన్నదేవరపేట-2 సచివాలయం పరిధిలోని సూరయ్యపేటలో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి హోం మంత్రి తానేటి వనిత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రి కార్యాలయ వర్గాలు కోరాయి.

వృద్ధులకు పోషకాహారం పంపిణీ

నిడదవోలు: స్థానిక రోటరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం టవల్స్, పోషకాహారం పంపిణీ చేశారు. ప్రత్తిపాటి చంద్రమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమార్తె లక్ష్మి ఆర్థిక సహాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో ఆ క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సీహెచ్ రాజ, వృద్ధాశ్రమం అధ్యక్షులు బీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 11వ వార్డులో గడప గడపకూ



కొవ్వూరు 11వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోందని, ప్రజలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 11 వార్డులో శుక్రవారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, అధికారులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లారు గత నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా అయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. వార్డు కౌన్సిలర్ తోట లక్ష్మీ ప్రసన్న, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ ,ఏఎంసీ మాజీ చైర్మన్లు బండి పట్టాభి రామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు నగ్లపాటి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సిద్ధన వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వెళ్లి సమస్యల పరిష్కారం

నిడదవోలు: ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో శుక్రవారం ఆయన గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటినీ సందర్శించి సంక్షేమ పథకాలపై ఆరా తీసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నివేదించిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి వల్లే తాను ఏ వార్డుకు వెళ్లిన ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ 600 హామీలు ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా గమనించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి పాలా మణి కిరణ్, కౌన్సిలర్లు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, ఎండి షకీరా బేగం, బిర్రే పార్వతి, పడాల శిరీష, ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు, ఆకుల ముకుంద రావు, దాకే అనిల్‌కుమార్, గుర్రం శాంతిశ్రీ, అహ్మదున్నీసాబేగం, తేలేటి జాన్సీ, మానుపాటి లక్ష్మీ, పట్టా పద్మావతి, ముండంటి మాణిక్యమాల తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు 27వ వార్డులో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

సొసైటీ అధ్యక్షుడిగా అక్షయ పాత్ర ప్రమాణ స్వీకారం నేడు

కొవ్వూరు: పట్టణంలోని శ్రీరామా సొసైటీ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు.హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి తదితర ప్రముఖులు హాజరు కానున్నట్లు రవీంద్ర తెలిపారు.

కార్యదర్శుల సంఘ మండల శాఖ అధ్యక్షుడిగా రాంబాబు

గోపాలపురం: పంచాయతీ కార్యదర్శుల సంఘ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆ సంఘం జిలా అధ్యక్షుడు వింత వీరరాఘవరెడ్డి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఎం.రాంబాబు, కార్యదర్శిగా ఎస్‌కే ఫాతిమా, కోశాధికారిగా ఎస్. చినవెంకాయమ్మ, ఉపాధ్యక్షుడిగా కె.సాంమూర్తి సభ్యులుగా కె. సురేష్, పి.రామచంద్రరావు, కేఎస్‌వీ అనురాధ, ఉయ్యాల నాగేశ్వరరావు, ఎస్‌కే హమీద్ నియమితులయ్యారు.

పాడి పశువులతో ఆర్థికంగా ఎదగాలి



తాళ్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

- జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్
- జగనన్న పాలవెల్లువ మహిళలకు అవగాహన

తాళ్లపూడి: ఇప్పటికే చేయూత, ఆసరా పథకాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు పశు సంపద అభివృద్ధి ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ సూచించారు. జగనన్న పాలవెల్లువ పథకంపై తాళ్లపూడి సచివాలయం వద్ద శుక్రవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ జీవనోపాధి మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో తేజ్ భరత్ మాట్లాడుతూ పశు సంపదను జీవనోపాధిగా చేసుకుని మనుగడ సాగిస్తున్న కుటుంబాలు జిల్లాలో ఎక్కువగా ఉన్నారన్నారు. చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా ఏడాదికి రూ.18750 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో ఒక్కో మహిళా లబ్ధిదారులకు రూ.75 వేలు అందజేసిందన్నారు. ఆ మొత్తాన్ని పశు సంపద సేకరణకు వినియోగించుకోవాలన్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా అమూల్ కేంద్రాలకు పాలు విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మండలంలో 411 మందిని పాలవెల్లువకు ఎంపిక చేశామని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా 15 మంది లబ్ధిదారులకు సబ్సిడీపై పశువులను అందజేశారు. డ్వాక్రా, స్త్రీ నిధి ద్వారా పశువుల కొనుగోలుకు రుణాలు కూడా ఇస్తామన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, పశుసంవర్ధక అధికారి ఎస్‌టీజీ సత్యగోవింద్, డీపీవో జేవీ సత్యనారాయణ, ఎంపీడీవో వి. రమణ, ఏపీఎం రోజ్ మాణిక్యం, స్థానిక నాయకులు నక్కా చిట్టిబాబు, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్దన రావు తదితరులు పాల్గొన్నారు.

పాలవెల్లువతో మహిళల ఆర్థికాభివృద్ధి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ

గోపాలపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో మహిళలు భాగస్వాములై, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. జగనన్న పాలవెల్లువపై మండల స్థాయి అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలవెల్లువ పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. పాలవెల్లువ రుడా కార్యదర్శి ఎస్. శైలజావల్లీ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి రుణ సదుపాయం కల్పించి పాడె గేదెలను అందిస్తామన్నారు. వచ్చిన పాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పాలవెల్లువ కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని డ్వాక్రా గ్రూపు సభ్యులకు, సీసీలకు సూచించారు. మండల ప్రత్యేకాధికారి ఎస్‌డీవీ సత్యగోవింద్, ఐకేపీ ఏపీఎం మున్నీసా పాల్గొన్నారు.

సమాజానికి ప్రథమ శత్రువులు దోమలు



నల్లజర్ల మండలం అయ్యవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య,ఆరోగ్య శాఖ సిబ్బంది

నల్లజర్ల: దోమలు సమాజానికి ప్రథమ శత్రువులని వాటి నిర్మూలనకు ప్రతి ఇంటా విధిగా డ్రైడే నిర్వహించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు సూచించారు. నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలోని దూబచర్ల, అయ్యవరం, కొత్తగూడెం, ఘంటావారిగూడెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన 50వ ఫీవర్ సర్వేను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. కీటక జనిత ప్రదేశాలను గుర్తించడంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను లక్ష్మణరావు ప్రజలకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు దరి చేరవన్నారు. అయ్యవరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు హేమలత, సుహాసిని, ఆశ కార్యకర్తలు అనిత, అనూరాధ, వలంటీర్లు, శానిటేషన్ సిబ్బంది, ఆరోగ్య సహాయకులు డి.సుబ్బారావు పాల్గొన్నారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధులు

ఉండ్రాజవరం: దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీలోని సీహెచ్‌వోలు సుబ్రహ్మణ్యం, డి.అనూష అన్నారు. కాల్దారి, ఉండ్రాజవరంతో పాటు పలు గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వారిద్దరూ క్షేత్రస్థాయికి వెళ్లి ఇళ్లలోని పరిశుభ్రతను పరిశీలించి, సూచనలు చేశారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కాల్దారిలో 60 మందికి నేత్ర వైద్య నిపుణుడు టి.రాంబాబు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 56 మంది కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు.ఎంపీహెచ్‌ఏ టి.మహలక్ష్మి, వైద్య శిబ్బంది ఎం.రమ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల అమ్మకు పౌష్టికాహారం



పెరవలి మండలం ఉసులుమర్రులో సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న సీడీపీఓ శ్రీలక్ష్మి

పెరవలి: టేక్ హోమ్ రేషన్ పంపిణీలో భాగంగా పలు ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం సంపూర్ణ పోషణ్ కిట్లు పంపిణీ చేశారు. మండలంలోని ఉసులుమర్రులో సర్పంచ్ వీరమళ్ళ భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో డి.శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలి చేతుల మీదుగా పోషకాహార కిట్లు పంపిణీ చేశారు.

ఉండ్రాజవరం: దమ్మెన్నులో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. అలాగే అదే గ్రామంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. అలాగే ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: కలవలపల్లి శివారు రామచంద్రపురంలో వైఎస్సార్ సీపీ నాయకుడు యర్లగడ్డ జోషి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. వార్డు సభ్యులు కె.సునీత, ఎల్.నాగరాజు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, మలకపల్లిలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి చేతుల మీదుగా లబ్ధిదారులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి నాగాంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు పూడి కుమారి పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా నిడదవోలును తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కాటకోటేశ్వరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కాటకోటేశ్వరం వైఎస్సార్ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా నిడదవోలును తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరం గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో రూ. 6 లక్షల వ్యయంతో నిర్మించే గ్రావెల్ రోడ్లు, బీసీ ఏరియాలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ డ్రైన్‌కు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో గెలిచిన తొలి ఏడాదిలోనే కాటకోటేశ్వరం గ్రామంలో ప్రధాన డ్రైన్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రతి గ్రామంలోని వైఎస్సార్, జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు కాలనీలకు వచ్చి ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప సెంటు భూమిని కూడా పేదలకు ఎప్పుడూ ఇవ్వలేదని శ్రీనివాస్‌నాయుడు విమర్శించారు. అనంతరం కాలనీ మహిళలతో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో రూ.8 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్)లో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, ఉనకరమిల్లి సర్పంచ్ పోలిరెడ్డి భారతి, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, సొసైటీ అధ్యక్షులు గుంటుపల్లి కృష్ణమూర్తి, యాళ్ల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోసూరి అప్పారావు, గుంటుపల్లి రామచంద్రరావు, పోలిరెడ్డి శివరామకృష్ణ, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మాలకోడు'తో మురుగు సమస్యలకు మోక్షం

నిడదవోలు: పట్టణంలో మురుగు పారుదలకు శాశ్వత పరిష్కారం చూపేలా మాలకోడు మురుగు చెరువును రూ.కోట్ల వ్యయంతో ప్రక్షాళన చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు.ఈ చెరువు ప్రక్షాళనలో భాగంగా చేస్తున్న పూడికతీత, చెరువు చెంతన ఉన్న అక్రమణల తొలగింపు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ చెరువు విస్తీర్ణాన్ని తెలుపుతూ పక్కాగా సరిహద్దులు తెలిపేలా సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, టౌన్ ప్లానర్ కె.సుప్రియ, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పనులను పరిశీలించిన చైర్మన్ ఆదినారాయణ